కథ

# అయిదో మనిషి

—— మల్లంపల్లి సాంబశివరావు

బెజవాడ నుంచి బందరెళ్లే ప్యాసింజర్ రైలులో గంటసేపు ప్రయాణించాక నేను దిగాల్సిన స్టేషనొచ్చింది. అక్కడి నుంచి డొంకరోడ్డు మీద పావుగంట నడిస్తే మా ఊరు. డొంకమీదుగా ఊరివేపు నడుస్తుంటే పొలాల్లోకి కలుపు తీయడానికి బయలుదేరిన ఆడవాళ్లు ఎదురవుతున్నారు. 'ఏరా మనవడా ఇదేనంట్రా రాడం' అంటూ ఒక గుంపులో నుంచి మా ఇంటి దగ్గరలో వుండే సరసమ్మ పలకరించింది.'అవునమ్మమ్మా' అంటూ బదులిచ్చాను.'ఎవరే ఈ పిల్లోడు ఆనమాలు తెలీటల్లా నాకు?' అంటూ సరసమ్మను ఇంకొక ముసలమ్మ అడిగిందానికి 'నీకు అప్పుడే నూవు అనిచావట్లేదా ఏంటే? ఆడు కాంతమ్మ పెద్ద కొడుకు. బెజవాడలో చదువుకుంటన్నాడు' అని వివరించింది.

నేను ఇంటికెళ్లేసరికి ఇంట్లో ఎవరూ లేరు, తాళం వేసుంది. మా అమ్మ కూలికెళ్లివుంటుంది. గొడ్డచావడి ఖాళీగా కనిపించింది. బహుశా మా అయ్య తిట్టుకుంటూ తిమ్ముకుంటూ గేదలను మేవుకు రావటానికి తోలుకుపోయుంటాడు. వసారాలో కెక్కరిస్తూ తిరుగుతున్న కోళ్లను అదలించి అక్కడున్న కుక్కి మంచం ఒకటి వాల్చుకున్నాను. కాసేపటికి కునుకులోకి జారిపోయాను. 'ఎప్పుడొచ్చావురా! అన్నం తిన్నావా? తాలం చేతులు గూట్లోనే వున్నయ్‌గా! తీసుకుని తినకపోయావా?' అంటున్న మా అమ్మ గొంతు విని మగతలోంచి మేలుకున్నాను. 'ఇందాకే వచ్చానమ్మా! ఏడుగంటల బండి బాగా లేటుగా వచ్చింది' అన్నాను ఆవలిస్తూ. 'ఇయ్యాల కూలికెల్లలా! మన చేలో కలుపు ముదిరిపోతందని ఎల్లి చేలో దిగిన కాసేపటికి పక్క చేను వుల్లమ్మోళ్లు నువ్వొచ్చావని చెబితే ... ఇక వచ్చేశా!'అని చెబుతూనే గబగబా పొయ్యి రాజేసింది. 'కాళ్లు కడుక్కొచ్చుకో! అన్నం తిందూగానీ' అంది. నేను తొట్టి దగ్గరకెళ్లి కాళ్లు చేతులు కడుక్కుని వచ్చేసరికి కోడిగుడ్డు అట్టు వాసన ముక్కులకు తగిలింది. 'ఇయ్యాల కూరేమీ వండలా! చిన్నోడు కూడా సద్దన్నం తిని మట్టిపనికి ఎల్లిపోయాడు. ఉత్తపచ్చడేమి తింటావులే అని కోడిగుడ్డు ఒకటుంటే అట్టేత్తన్నా' అని చెబుతూ మళ్లీ కోళ్ల మంచి చెడులు చెప్పటం మొదలుపెట్టింది.'ఈ మద్దెన రోగాలొచ్చి మన కోళ్లు సచ్చినియ్. ఒకటుంది గానీ అది పొదిగిసత్తంది'.



నాకు ఊళ్లోనే వున్న మా పెద్దమ్మ వాళ్లు గుర్తొచ్చారు వెంటనే. మాకు ఎకరం భూమైనా వుంది. వాళ్లింట్లో అంతా కేవలం రెక్కల కష్టం మీదే బతకాలి. అయినా వాళ్లతో పోల్చుకుంటే మా ఇంట్లో కోళ్లు కోసి ఇంటిల్లిపాదీ సంతోషంగా తినటం చాలా తక్కువ. 'కాంతానికి కాపీనం ఎక్కువ. ఎప్పుడన్నా ఒక కోడిని కోసి పిల్లలకు పెడదామని వుండదు. అయిరోగాలొచ్చి సత్తే మాత్రం, అయ్యో!నాకు కోసుకుతింటానికి చేతులు రాలేదు అని తెగ బాదపడిపోద్ది'అని వాళ్లు మా అమ్మను ఆటపట్టించేవాళ్లు.'మీకేమ్మా !అట్టాగే జెబుతారు.



---

**ఆ తల్లికి ఇద్దరు కొడుకులు. చదువరులు. ఇల్లు పట్టని భర్త! తాగేదీ, ఏ బెజవాడకో పోయ్ దండగమారి పనులకు దుడ్డు ఖర్చు పెట్టుకొచ్చేది మాత్రం తెల్సు! అయినా ఆ అమ్మకేం? కొట్టంలో గేద వుంది. అది కొట్టంలో వున్నా నలుగురున్న ఆ ఇంట్లో అయిదో మనిషి లాంటిది. దాన్ని అబ్బనాకారంగా చూసుకుని మొగుణ్ణీ, ఇద్దరు బిడ్డల్నీ సాకి సంతరించుకుంటూనే వుందా తల్లి!**

**ఆ అమ్మకు పుట్టిన పిలగాడు మల్లంపల్లి సాంబశివరావు** మొట్టమొదటిసారిగా రాసిన మంచికథ 'అయిదో మనిషి'


---

మీ వోళ్లలాగే మా మంద కూడా పనీపాటా చేసుకొచ్చి 'మూట' తీసుకొస్తే కోళ్లను, గొర్రెలను వొండిపెట్టడానికి నాకేమన్నా తీపరమా? సంకురాత్రికి కోడిపందెగాళ్లు రెండు డబ్బులు ఎక్కువిచ్చి కొంటారు గందా అని ఆశపడ్డాను. మద్దెలో గత్త రొచ్చి మింగుద్దని నేనేమన్నా కలగన్నానా? అయినా కోడికూర కడుపులో కాపరం చేత్తదా ఏంటి? గోంగూర తిన్నా ఎల్లమారిపోద్ది'అంటూ తన నీవా సితనాన్ని సమర్థించుకునే తీరు గుర్తొచ్చి నాలో నేను నవ్వుకున్నాను.

కంచంలో అన్నం పెట్టిచ్చింది. నేను కుక్కి మంచంలో కూర్చుని తినటం చూసి 'మొగోళ్లు మంచం మీద కూర్చుని తినగూడదురా'అంటూ వారించబోయింది. 'అట్టా అని ఎవురు చెప్పారు నీకు?' అంటూ నవ్వుతూ అడ్డం మాట్లాడాను. 'రెటమతం లంజేకొడుకులకి ఏం జెబుతాం' అంటూ గొణుక్కుంది. నేను ఊరికి ఐదారునెలల తర్వాత వచ్చాను. ఈ లోగా ఊళ్లో ఏమేం జరిగాయో చెప్పసాగింది. 'అప్పలెక్కువైపోయి అంజయ్యగారు రెండెకరాల పొలం అమ్మేశాడు'. 'ఎంకమ్మ మనవరాలికి పెళ్లికుదిరిందిరా! చిన్నప్పుడు సొట్టబుగ్గలేసుకుని ఏమంత బాగుండి సచ్చేది గాదు. ఉప్పుడు బాగానే తయారైంది గుంట' అని ఆ సంబంధం విశేషాలు చెప్పింది. 'ఆ పిల్లకి నిండా పదిహేనేళ్లు కూడా వున్నట్టు లేదు. అప్పుడే పెళ్లేమిటమ్మా?' అని నేను అన్నందుకు 'నీది మరీ సోద్దెంరా! ఆళ్లు ఉప్పటికే బాగా లేటయిపోయిందని బాదపడిపోతంటే...'అంటూ దీర్ఘం తీసింది. 'సరేగానమ్మా! ఆ మధ్య ఎంకటరెడ్డికి బాగోలేదన్నారు. ఇప్పుడు బాగున్నాడా?' అనడిగాను. 'ఇంకెక్కడ ఎంకట్రెడ్డి? ఏట్టో కలిసి కూడా రొండు నెల్లయిపోయింది. రాయిలాంటి మడిసి. ఆయన అంత తొందరగా పోతాడని ఎవురూ అనుకోలా! నెల రోజులు మంచంలో పడ్డాడు. కొడుకులు ఒకాయనేమో అయిదారాబాదులో, ఇంకొకాయన ఇంకేదో ఊరిలో ఉన్నారంట. ఆళ్లు మొదట ఒకసారి వచ్చి చూసి ఎల్లిపోయారంట. అప్పుడు పెద్ద జబ్బేమీ లేదంట. మళ్లీ రొండు నెలలకి బాగా తిరగబెడితే బెజవాడ పెద్దాసుపత్రిలో జేరిత్తే డాకట్రు నమ్మకం జెప్పలేదంట. మంచి కూర, మంచి బువ్వ తినకుండా ఇరవై ఎకరాలు సంపాదిచ్చాడు. ఏం లాబం చివరికట్టా ఎల్లమారిపోయాడు' అంటూ ఎంకటరెడ్డి కోడళ్లనీ, కొడుకుల్నీ వారి నిర్లక్ష్యాన్నీ ఆడిపోసుకుంది. అదంతా విన్నాక ఎప్పుడూ కాయకష్టం చేసే ఎంకటరెడ్డి గుర్తొచ్చి నాక్కూడా 'పాపం' అనిపించింది.

పచ్చడితో అన్నం తినడం అయిపోయాక 'పెరుగుందా? మజ్జిగ పోస్తావా?' అంటూ ఆమె వంక చూసేసరికి ఆమె ముఖం కళతప్పిపోయింది.'నా మతి మండినట్టే వుంది. నీకు ఊళ్లో సంగతులన్నీ చెప్పకొచ్చా గానీ మనింట్లో సంగతే మరిసిపోయాను. పోయిన అమాసనాడు మన ముసలిగేద సచ్చిపోయింది. పాసువుల డాకటర్ గారిని తీసుకొచ్చి







## మాధురీ దీక్షిత్

### సరదా

బాలీవుడ్‌లో వరుసగా ఫ్లాప్‌లు ఎదురవ్వడంతో రూటు మార్చింది మాధురి దీక్షిత్. సౌత్ నుంచి బాలీవుడ్‌కెళ్ళి ఒక పూవు పూవుతున్న రంభని చూశాక మూడ్ వచ్చినట్టుంది. సౌత్ సినిమాల్లో నటించడానికి సిద్ధం అంటోంది మాధురి. ఆల్‌రెడీ అరవింద స్వామితో 'ఇంజనీర్' సినిమాలో చేస్తున్న తనకి మంచి పాత్రలిస్తే చేసి చూపిస్తానంటోంది ప్రస్తుతం హిందీలో బేరాల్లేని ఈ పెదపాప.

చూపిచ్చాం, మూడొందల రూపాయల మందులు వాడినా బతకలేదు' అంటూ ముక్కు చీదుకుంది. ఆమె కళ్లలో కన్నీటిపొర. ఒక ఆత్మీయుడైన మనిషి పోతే కనిపించే దిగులు లాంటిదే ఆ క్షణంలో ఆమె ముఖంలో కనిపించింది. 'మనిషి పోతేనే ఎవరూ పట్టించుకోని ఈ రోజుల్లో ఈమె ఒక గేద గురించి మరీ అంత ఎక్కువగా బాధపడిపోతుందేట్రా బాబూ' అని ఒక్క క్షణం అనుకున్నాను. అలా అనుకున్నందుకు మరు నిముషం నాలో నేను చాలా సిగ్గుపడ్డాను. నలుగురం ఉన్న కుటుంబాన్ని లాగడంలో అమ్మకు ఆ గేద ఎంతో ఆదుకుంది. మా రక్తంలో మా అమ్మ ఇచ్చిన పాలున్నాయో లేవో కానీ ఆ గేద పాలు మాత్రం వున్నయ్. ఒక రకంగా ఆ గేద మా ఇంట్లో ఐదోమనిషి లాంటిది. కొంచెం మెల్లకన్నుతో, బారు కొమ్ములతో వుండే ముసలిగేదకు అసలు కొమ్ములే సరిగ్గా రాని రోజుల్లోకి... అంటే దాదాపు దాదాపు పన్నెండు పదమూడేళ్లు వెనక్కి వెళ్లిపోయింది నా మనసు.

xxxxxxxxx


అప్పుడు నేను ఆరో తరగతి మా తమ్ముడు ఐదో తరగతి చదువుతున్నాం. ఆ రోజు బడి వదిలిపెట్టగానే తిన్నగా ఇంటికి రాకుండా ఆటలాడి చీకటి పడుతుండగా ఇంటికి చేరాం. అమ్మ అప్పుడే కూలి కెళ్లి వచ్చింది. ఊళ్లో పనులైపోయినయ్. రెండు మైళ్ల దూరంలో ఉన్న ఎలికపాడు వెళతన్నారు కూలికి. పొద్దుగూకులూ బురదచేలో పనిచేసింది గాక రెండు మైళ్లు నడిచొచ్చిందేమో – ఇంటికి రాగానే కాసేపు కూర్చుండిపోయింది. లేచి దీపం బుడ్డి వెలిగిస్తుండగానే పెద్దగాలి ● వెనుకే .. పెద్ద పెద్ద చినుకులు మొదలయ్యాయి. 'బయటున్న పుల్లలు పిడకలు ఎత్తి లోపల పడేయండ్రా' అని మాకు చెప్పి ఆమె బయట ఆరేసి వున్న బట్టలూ, మంచాలు అన్నీ ఇంట్లోకి చేరవేసింది. మేము గంపకేసుకుని ఎత్తటం మొదలుపెట్టేసరికి వాన పెద్దది కావటంతో అవి బాగానే తడిసిపోయాయి. వాటితోనే పొయ్యి వెలిగించాలి. అవి తొందరగా అంటుకోవటం లేదు. ఇనప గొట్టంతో దగ్గొచ్చిందాకా ఊదుతూనే ఉంది. ఆ పొగకు కళ్లవెంట నీరు కారుతోంది. 'నేను గట్టుమీదున్న తుమ్మ మొద్దు ఎండిపోయింది వరుక్కు రమ్మని చెబితే చెవులకి నాటుద్దా? పెట్టుద్దా? వానా వొంగుడం వచ్చినప్పుడు కూడా చితుకులతో వండాలంటే వానా సావుగా వుంది. వొండుంచితే ఒక్కోడు కూటేలకి జేరుకుని కమ్మగా తింటారు' అంటూ అక్కడ లేని మా అయ్య మీద కోపం చూపింది. చివరికీ ఊదీ ఊదీ పొయ్యిని మండించింది. బయట వాన తగ్గలేదు. గేదలు బయటేవున్నాయి.

దీపం బుడ్డి దగ్గర వున్నకాలు తీసి కాసేపు చదువుకున్న తర్వాత మా ఇద్దరికీ అన్నాలు పెట్టింది. 'అమ్మా! సుబ్బారావు మేస్టారు ఇంకా అన్ని పుస్తకాలూ కొనలేదేరా మివ్వు అని తిట్టారు' అని నేను చెబితే 'పాల డబ్బులు వొచ్చాక కొంటాలే' అని హామీ ఇచ్చింది. కూరన్నం తినటం అయిపోయాక మజ్జిగ పోసింది. పెరుగు లేదని చిన్నోడు ముఖం కష్టంగా పెట్టుకుని వుండటం గమనించింది. 'దెంగిలాగటానికి పాలు పెరుగులు గావాలి. గేదలను మాత్తరం ఒక్కడూ పట్టిచ్చుకోడు. మీ అయ్యేమో ఎక్కడ పదిరూపాయలు దొరికితే అక్కడ అయి తీసుకుని తాగుతాడు. లేపోతే ఏ బెజవాడలో, గుడివాడలో తిరిగొత్తాడు. నాల్రోజుల్నించి గొడ్డను ఇప్పలేదు. సరైన మేతానీళ్లు లేక పొద్దున పాలు తగ్గిపోయినయ్. ఇంక పెరుగెక్కడనుంచొత్తది. అయి లేపోతే ఏం తాగుతార్రా ఊళ్లో వాళ్ల ఉచ్చ! అయ్యుండబట్టే అన్నింటికీ అడ్డం పడతన్నయ్. లేపోతే ఈ మగోడు చేసుకొచ్చి.. ఈ కాపరం బాగుపడి వచ్చినప్పుడు...' అంటూ తనలో తాను అనుకుంటున్నట్టుగానూ మాకు చెబుతున్నట్టుగానూ లోపలి బాధను వెళ్లగక్కింది.

తినేసి మేం మంచమెక్కేశాం. అమ్మ నీళ్లు కాసుకుంటూ పొయ్యి దగ్గర కూర్చునుండిపోయింది. ఈ లోగా వాన కూడా తగ్గిపోయింది. 'ఏమే! నీళ్లు కాగినయ్యా' అంటూ మా అయ్యొచ్చాడు. రావటం రావటం వాల్చివున్న నులకమంచానికి అడ్డం పడ్డాడు. తాగాడనుకుంటా! రెండు నిమిషాలు ఏమీ మాట్లాడలేదు అమ్మ. 'ఏం ఇర గబడ్డావని నీళ్లు కాసుంచాలి నీకు? ఇయ్యాలంతా ఏడికి నచ్చినట్టు? ఆ గేదల్ని కాసేపు మేపుకొత్తే నీ కండలు కరిగిపోతయ్యనుకున్నావా? వరిగడ్డి కూడా తక్కువుందన్న సంగత్తెలుసుగా' అంటూ గయ్‌గయ్‌మని లేచింది ఆయన మీదకి.

'చిన్న పనుండి బెజవాడెల్లాలే' అంటూ గొణిగాడు. 'అంత ముక్కెమైన పని ఏంటది? నీ మేనగోడలు సంవర్తబంతా? లేపోతే మీ మేనత్త దినమా? ఇంట్లో రాగికాణీ లేక నేను నానాచావులు చత్తంటే నీకు బెజవాడెల్లటానికి డబ్బులెక్కడియ్యి?' అంటూ ప్రశ్నల మీద ప్రశ్నలేసింది. 'పాలాయన్ని అడిగి యాబయ్ రూపాయలు తీసుకున్నాలేవే' అన్నాడాయన. 'యాబయ్ రూపాయలు ఉత్త వుణ్ణేనికి నీ పొట్టన పెట్టుకున్నావన్న మాట. కూలికి ఎల్లకుండా నట్టం చేసింది కాకుండా యాబయ్ రూపాయలు ఉరదాకర్చు! ఇంట్లో న్యూనె లేదు. కూరగాయలు కొంటానికి డబ్బుల్లేవు. పిల్లలు పచ్చడేసుకు తింటన్నారు. కోమటింట్లో మూడొందల బాకీ అట్టాగే ఉంది. పిచ్చిరెడ్డికియ్యాల్సిన రెండొందలకి వడ్డీ ఎంత పెరిగిందో! నోటినిండా పళ్లు ఊరి నిండా అప్పులు అన్నట్టుగా వుంది. నీ వల్ల ఎంత నట్టం ఎంత నట్టం. ఈ కాపరం చేయడం కన్నా ఏదన్నా మింగి సత్తే పీడాపోద్ది' కోపంగా తిట్టడం మొదలుపెట్టింది.

మా అయ్యకు బాగా కోపం వచ్చినట్టుంది. మంచంలోంచి లేచి 'ఏంటే నీ యమ్మ.. తెగ నీలుగుతున్నావ్..నీ బాబుగాడి సొమ్మేదో నేను తినేసినట్టు ..' అంటూ ఆమె జుట్టు పట్టుకున్నాడు. ఫెడీఫెడీమని నాలుగు తన్నవే తన్నాడు. 'ఒరి




### ఇంగ్లీష్‌లో కామసూత్ర

ఏకాలంలోనేనా ఎవర్ గ్రీన్ సబ్జెక్స్ ఏంటంటే భక్తి, రక్తి. అందుకే 'కామసూత్ర' కూడా ఎవర్ గ్రీన్. భారతీయ సినిమా పరిశ్రమే కాకుండా ఇప్పుడు హాలీవుడ్ కూడా 'కామసూత్ర'ని సినిమాగా తీసి డబ్బు చేసుకోవాలనుకుంటోంది. 'పెర్‌ఫ్యూమ్డ్ గార్డెన్' పేరుతో వరుసగా ఏడు సినిమాలుగా 'కామసూత్ర'ని జగ్‌మంద్రా దర్శకత్వంలో గ్రెగరీ కేస్కేంటె నిర్మిస్తున్నాడట.



### నమ్రత వెనుకడుగు

జూహీ చావ్లాని పక్కన పెడితే మిస్ ఇండియాగా ఎన్నికైన వాళ్లెవరూ వెండితెరమీద ప్రతాపం చూపించలేక చతికిలబడినవాళ్లే. 'మేరే దో అన్‌మోల్ రతన్', 'హీరో హిందుస్తానీ' అనే సినిమాల్లో అవసరానికి మించి విప్పి చూపించిన నమ్రతా శిరోద్కర్ ఛాన్సుల కోసం ఎదురుచూస్తోంది. తన అక్క శిల్పా శిరోద్కర్ ('బ్రహ్మ' సినిమాలో మోహన్ బాబు సరసన హీరోయిన్) అడుగు జాడల్లో ఇప్పుడు తెలుగులో కూడా ఓ సినిమా చేస్తోంది.

నీ దినం చెయ్యా, నీకు గత్తర తగల' అంటూ ఆమె ఏడుపు లంకించుకుంది. నేను చూస్తూ అట్టాగే వుండిపోయాను. 'గబాలున పెద్దోడినై పోతే మా అయ్య డొక్కలో ఈడ్చి తందును గదా' అని వాలో నేను కుతకుత ఉడికిపోయాను. ఈ గొడవకి పక్కింటి సూరమ్మ వచ్చింది. 'ఎందుకురా ముండనచ్చినోడా దాన్నట్ట గొడతన్నావ్! పనీపాటా జెయ్యకపోయినా చాకిరీ చేసి వొండిపెడతందిరా మీకు' అంటూ తన పెద్దరికంతో మా అయ్యను నిలవరించింది. 'అత్తా నన్నొదులు.. దీన్ని..దీన్ని' అని ముద్ద ముద్దగా అంటూ మళ్లీ అమ్మ మీదకు వెళ్లబోతున్న అయన్ని మంచం మీదకి నెట్టింది సూరమ్మ. 'కొట్టింది పాల్లేరా నన్నాసోడా! నీకిల్లూ, గొడ్డూగోదా ఏదీ పట్టదు. ఒక్కతి ఎన్ని పను లని చూసుకుంటదిరా! సిగ్గులేపోతే సరి' అని బాగా కోప్పడింది. ఆయన మంచంలో నుంచి లేవలేదు. నిద్రలోకి జారుకుంటున్నాడనుకుంటా !గురక మెల్లగా వినిపిస్తోంది. అమ్మ గోడకి చేరగిలబడి ఏడుస్తు ముక్కులు చీదుకుంటూ వుండిపోయింది. సూరమ్మ మా అమ్మ దగ్గరే కూర్చుంది. 'ఇక లెగిసి అన్నం తినవే' అందామె అమ్మను ఉద్దేశించి. 'అదిగాదు పెద్దమ్మా! గేదలు లేక ముందు నానాపావు సచ్చాం. గేదలంటే కొంచెం కూడా శ్రద్ధ లేపోతే ఎట్టా? కూలివాలి సమ త్సరమంతా ఉండదు గందా? ఆ గేదలుండబట్టే ఎట్టాగొట్టా నెట్టుకొత్తన్నాము' అంటూ సూరమ్మతో గోడు వెళ్లబోసుకుంది. 'సర్లేవే. ఇది రోజూ ఉండే బాగోతమేగా! ఆ నీళ్లు ఆరిపోయే వుంటయ్. రెండు చెంబులు గుమ్మరిచ్చుకుని అన్నం తినవే' అంటూ సూరమ్మ గోడకు చేరగిలబడి కూర్చున్న అమ్మను లేపే ప్రయత్నం చేస్తోంది.

ఈ గొడవ వల్ల నాకు నిద్రరాలేదు. ఆమె తన్నులు తింటానికి కారణమైన గేదల మీదకి ఆలోచనలు మళ్లాయి. మేం మరీ చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు మాకు పాలు పెరుగూ తెలీదు. ఏ గేదను కొన్నా కలిసొచ్చేది కాదు. మా అయ్య కొన్న గేద లన్నింటిలోనూ నష్టమే వచ్చింది. ఒకటి కొన్న కొన్ని రోజులకే పాలెగ్గొట్టింది. ఇంకోటి నాలుగునెలలకే చచ్చిపోయింది. ఇట్టా ఏ ఒక్క గేదవల్లా సరిగా కలిసిరాలేదు. పైగా నష్టాలు, అప్పులు. ఒకసారి మా అమ్మ వాళ్ల పుట్టింటికి వెళ్లినప్పుడు పిల్లలు మజ్జిగ నీళ్లకు కూడా మొహం వాచిపోతున్నారని చెప్పుకుని బాధపడింది. అప్పుడు మా తాత మాకు ఒక పెయ్యదూడను తోలాడు. ఆ దూడను మా అమ్మ రెండు మూడేళ్లు బాగా మేపింది. అది ఎదిగి చూడిదైనాక తొలిసారిగా పెయ్యదూడనే పెట్టాలని దేముడి పటాల ముందు నిలబడి దణ్ణం కూడా పెట్టుకుంది. గేద ఈనే రోజున ఆమె ఎక్కడికీ వెళ్లకుండా దానినే కనిపెట్టుకుని ఉండిపోయింది. గేద అర్ధరాత్రప్పుడు ఈనింది. ఆమె కోరుకున్నట్టుగా పెయ్యదూడే. దూడ భూమ్మీద పడగానే గేద ఆప్యాయంగా దాని ఒళ్లంతా నాకింది. ఆ రాత్రి నేను లాంతరు పట్టుకుని చావిట్లో మా అమ్మకు తోడుగా ఉండిపోయాను. ఆ అర్ధరాత్రి ఆమె తాటాకు చితుకులు ఏరి నీళ్లు కాచింది. ఆ నీళ్లతో గేద ఒళ్లంతా శుభ్రంగా కడిగింది. గేదకు పొద్దున్నే పెట్టడానికి జొన్నలు దంచింది. ఆ రాత్రి ఆమె నిద్రను మరిచిపోయింది.

ఆ రకంగా ఇంట్లో సొంత గేదలుండటం మొద లైంది. దున్నపిల్లలు పుడితే మాత్రం గేద పాలి య్యడం మానేయగానే మాదిగ ఎంకట్రాముడికి అమ్మేసేవాళ్లం. గొడ్డ బేరం చేసే ఎంకట్రాముడు 'మంచి గేదలమ్మా కాపోతే మీరు మేపలేకపో తన్నారు' అంటూండేవాడు. ముసలిగేదకు పుట్టి పెద్దయిన గేదల్ని ఒకటి రెండు ఈతల వరకూ వుంచుకుని అమ్మేసేవాళ్లం. ఇంట్లోకి కాసిని పాలు వుంచుకుని కాసిని పాలు అమ్మేవాళ్లం. అప్పటినుంచే ఇంట్లో దరిద్రం చాలా వరకూ తగ్గింది.

'పొద్దు పోతంది పెద్దమ్మా! నేను ఈ గొడ్డను



లోపలకట్టేసి ఆ బయటున్న రొచ్చు, పేడ తీయాలి. కోడలు ఎదురుచూత్తందేమో ఇంటికెల్లు' అంటూ మా అమ్మ గేదల దగ్గరికి నడిచింది. 'తినకుండా పడుకోమాకే 'అంటూ సూరమ్మ వాళ్ల ఇంటివైపు కదిలింది.

xxxxxxxxx

నేను లేచేసరికి బాగా తెల్లవారిపోయింది. అప్ప టికి మా అమ్మ యధావిధిగా గేదలపాలు తీసి పాలాయనకు పోసేయటం, ఇల్లూవాకిలీ, గొడ్లచా వడి అన్నీ ఊడ్చి కళ్లాపి చల్లి ముగ్గులేయటం లాంటి పనులన్నీ చేసేసింది. నేను లేచి ఎదురింటి మాణిక్యం దొడ్లో వున్న వేపచెట్టు దగ్గరకెళ్లి వేపపుల్ల విరుచుకొచ్చుకున్నాను. అప్పటికే మా అమ్మ పొయ్యి రాజేసింది. అరగంటలో అన్నం కూరా వండేసింది. పాలు కాగబెట్టి తోడుపెట్టింది. ఆ పనులయ్యాక ఇంట్లో అందరూ విడిచి న బట్టలను బక్కెట్టు నిండా పెట్టుకుని దగ్గరలో వున్న పంటకాల్వలో ఉతుక్కుని వచ్చి వాటిని తీగ మీద ఆరేసింది.

అప్పటికే బాగా ఎండెక్కింది. 'ఏమే ఇంకా అన్నం కట్టుకోలా' అంటూ సూరమ్మ వచ్చింది. 'ఇయ్యాల కూలి మానేద్దామనుకుంటన్నా పెద్దమ్మా! గొడ్డను జూత్తే పేణం ఉసూరుమనిపిత్తంది. ఇయ్యాల గూడా ఇప్పదీయకపోతే అటి ఉసురు తగులుద్ది నాకు. పేడ, రొచ్చూ అటి ఒంటి నిండా అంటుకు పోయి ఎట్టా అట్టలు కట్టాయో చూడు' అంటూ గేదల వైపు చూపించింది మా అమ్మ. 'అదు రాత్రి తాగి ఇంకా లెగవలేదా? పోతే పోయిందిలే ఒక రోజు కూలి. అయి పాలెగ్గొట్టినయ్యంటే సచ్చేసావు. సరే నేను బోతాలే అవతల అందరూ ఎలతన్నారు'అనేసి వెళ్లిపోయింది సూరమ్మ.

మేం బడికెళ్లిపోయాం. మా అమ్మ గేదల్ని విప్ప దీసింది. మధ్యాహ్నం పెద్ద వానొచ్చింది. మాకు బాగా వానొస్తే చాలా సంతోషం. ఎందుకంటే బడి వదిలిపెట్టేస్తారు. ఆ రోజు కూడా బడికి మధ్యాహ్నం నుంచి సెలవిచ్చేశారు. మా అమ్మ కూలికిపోలేదు కాబట్టి ఎందుకైనా మంచిదని బడి వదలగానే తిన్నగా ఇంటికి వెళ్లిపోయాం నేనూ చిన్నోడూ. మధ్యాహ్నం దాటిపోతున్నా ఆమె గేదల్ని తోలుకుని ఇంటికి రావటం లేదు. ఆమె వచ్చేస్తే కాసేపు ఇంటి దగ్గర కనిపించి ఆటలకు పోవా లన్నది మా ఆలోచన. ఆమె ఎంతకీ రాదు. వర్షం కూడా వచ్చింది కదా! బాగా తడిసిపోయుంటుంది. గొడుగు లేదు. ఏ చెట్టుకిందో ఆ కాసేపు నిల బడివుంటుంది. వేసవి కాలంలో కూడా ఎర్రటి అగ్గిలో చెప్పులు కూడా లేకుండా గేదలను మేపుతా వుంటది. ఎండకీ, వానకీ కొంగును నెత్తిమీదకు లాక్కుని తన పని తాను చేసుకుపోతుంది. మొత్తానికి మూడుగంటల బండి వెళ్లిపోయిన తర్వాత గేదలు ఉత్సాహంగా వాకిట్లోకొచ్చాయి. బుడమేట్లో దింపి శుభ్రంగా కడిగినట్టుంది. ఆ వెనకాల వస్తుందామె. పూర్తిగా తడిసిపోయింది. కాలుకుంటుతూ ఇంటికి వచ్చి మంచం లాక్కుని కూలబడింది. 'ఏమైందమ్మా' అంటూ ఇద్దరం దగ్గరకు వెళ్లి కాలు పట్టుకుని చూస్తే అరికాల్లో పెద్ద గాయం కనిపించింది. 'గేదలు డొంకమీద ఆగకుండా రామిరెడ్డి గారి చేలోకి దూకినియ్. నిన్నే ఆ చేలో ఏదో మందులు చల్లారంట. పొర పాటున ఒక్క పరక తిన్నా మళ్లీ ఈటికేమన్నా అవుద్దని బయమేసి నేను కంగారులో బోదిలోకి దూకి వాటిని పక్కకి తోలాను. ఆ బోదిలో నీళ్లకింద అంతా కరతమ్మ కంప వున్నట్టుంది.

కాలినిండా ముళ్లే. సీసా పెంకో ఏదో గానీ కోసుకుపోయింది' అని చెప్పింది. కిరసనాయిలు డబ్బా తెచ్చిపెట్టమంటే చిన్నోడు తీసుకొచ్చాడు. అందులో నుంచి కొంచెం కిరోసిన్ను తీసుకుని గాయం మీద పోసింది. దాని మీద కొంచెం పసుపు వేసి గుడ్డపీలికతో కట్టుకుంది. అప్పటికే ఆ కాళ్లూ, చేతులూ పాచిపోయి వున్నాయి. ఆ పైన ఈ గాయం.

ఆ సాయంత్రానికి వరిగా వుందని ముణగదీసుకుపోయింది.'కాసేపాగాక నేను వొళ్లు చూస్తే కాలిపోతంది. కోమటింటికి వెళ్లి 'జొరం బిళ్ల' తెచ్చాను. 'ఇయన్నీ ఎందుకురా! తెల్లారితే అదే తగ్గిపోద్ది! అంటూ బలవంతంగావే ఆ బిళ్ల మింగింది. ఈ జ్వరం పేరు మీదన్నా ఇక రెండు రోజులు ఇంటిపట్టునే ఉంటుందిలే అనుకున్నాను. ఉండాలని కోరుకున్నాను. కానీ నేననుకున్న విధంగా జరగలేదు. ఆ తెల్లారి మామూలుగానే లేచిపోయి నిదానంగా అన్ని పనులూ చేసేయడం మొదలుపెట్టింది. అన్నం క్యారేజీ కూడా కట్టేసుకుంది. 'ఒంటో బాగోలేదు కదే! ఇయ్యాల కూడా మానెయ్యరాదూ!'అని సూరమ్మ చెప్పినా వినిపించుకోలేదు. 'ఈ మాత్రం దానికే మానేత్తే ఎట్టా జరుగుద్ది పెద్దమ్మా!ఆ మనిషి చూస్తే అట్ట! ఇక నేను గూడా కూలి పున్న వాళ్రోజులూ చేయకుండా ఎగ్గొడితే సంసారం నడిసినట్టే!పద..పద' అంటూ బయలుదేరింది. 'నువ్విట్టా చేయబట్టే ఆడి ఆటలు అట్టా సాగుతున్నయ్యే! నీ పేణమంతా చేలోనూ, గొడ్డూగోదలోనూ వుంటదిగా! నువ్వు వినవని నాకు తెలుసులేవే. చూడంద్రా మీ అమ్మ..' అంటూ మా కేసి చూసింది సూరమ్మ. 'నువ్వు కదులు పెద్దమ్మా' అంటూ కాలీడ్చుకుంటూ బయలుదేరింది. వొంట్లో బాగున్నా బాగోకపోయినా ఏదో ఒక సాకు చెప్పయినా కాసేపు విశ్రాంతి తీసుకోవటం మా అమ్మకు వల్లగాని పని.

xxxxxxxxx

'రెండు మానికలు బియ్యం ఉంటే ఇత్తా! పొలం పనుల్లో పడి మీ బాబాయి వద్దు మర ఆడించలేదు. రేపో ఎల్లుండో ఆడిత్తాడంట' అంటూ మా ఇంటికి పదిళ్ల అవతల వుండే మాణిక్యం వచ్చింది ఇంటికి. నన్ను చూసి 'ఈడెప్పుడొచ్చాడూ ' అంటూ అడిగింది మా అమ్మను. పండక్కొచ్చాడని ఈ రోజు వెళుతున్నాడని మా అమ్మే సమాధానం చెప్పింది. ఆమెకి బియ్యం అప్పు ఇచ్చాక కాసేపు కూర్చుని అదీ ఇదీ మాట్లాడుకున్నారు. 'ఏమోలే కాంతమ్మా! పిల్లలు పెద్దోళ్లవుతున్నారుగా ! ఇక నీ బాదలు తీరతయిలే' అంది నవ్వుతూ. దానికి మా అమ్మ నవ్వలేదు. 'అయ్యొ చూశాడు ఇక కొడుకులు జూత్తారు. ఇరవై ఎకరాలు సంపాదిచ్చిన ఎంకటరెడ్డినే ఎవరూ సరింగా జూడలా. ఈళ్లు నన్ను సూడకపోయినా ఆళ్ల వరకూ సుకంగా బతికితే అంతే చాలు. నాకు ఒంట్లో ఓపికున్నంత కాలం రెండు గేదలను పెట్టుకుని బతుకుతా!' అంటూ మనుషుల మీద కన్నా పశువుల మీదే నమ్మకాన్ని ప్రకటించింది. ముసలిగేద లేని చావడిని, కుడిచెయ్యి పడిపోయినట్టయిన మా అమ్మను చూసి...ఒక మనిషి పోతే అనిపించేటంత దిగులు మనసు నిండా కమ్ముకుంటుండగా రైలెక్కాను.



# మీ కోపతాపాలు ఇంట్లో కాదు ఇకపై చూపండి. కోపిష్టి పేజీ

కోపం ఒక్కోసారి కొంప కూలుస్తుంటుంది. చిరుకోపమైతే ఫర్వాలేదు గానీ పిచ్చికోపం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుంది.

ఉదాహరణకి కూరలో ఉప్పు తక్కువైనా, ఎక్కువైనా భర్తగారికి కోపమొచ్చి తినే పళ్ళెన్ని విసిరి కొడతాడు. అది కాస్త మూడో తరగతి చదివే అమ్మాయి మూతిమీద పడి పచ్చడవుతుంది. దీంతో భార్యకి పిచ్చికోపమొస్తుంది. మొగుణ్ణేం చేయలేక ఎల్‌కేజి చదివే పిల్లాడి వీపును బాదుతుంది. ఓ పక్క అమ్మాయి ఏడుపు. దీనికితోడు అబ్బాయి గగ్గోలు. వాడు ఏడుస్తూనే ఖోపంగా 'వుండండి మీ పని చెప్తా' నని అందాక రాసుకుంటూ రాసుకుంటూ వున్న బలపమ్ముక్కని కాస్తా ముక్కులో దోపుకుంటాడు.

ఇంక ఏముందీ? కొడుకునీ, కూతుర్నీ చెరోచంక వేసుకుని అక్కడా ఇక్కడా ఇల్లంతా గాలించినా వంద రూపాయలు దొరక్కపోయేసరికి పామునోట్లో వేలు పెట్టి 3 0 0 రూపాయలు అప్పుచేసి డాక్టరు దగ్గరకు వెళ్ళి కోపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవడం..

అయినా బుద్ధిరాదు కదా., ఇది జరిగి వారంకాకమునుపే మళ్ళా ఏదో ఒక కోపం.. మళ్ళా ఏదో ఒక అనర్థం..

ఆరోజుకి కోపం చిరాకు తెచ్చినా సంవత్సరం తర్వాత తలుచుకుంటే అవన్నీ సరదాగానే, భయంకరమైన పీడకలగానో గుర్తొస్తాయి.

అలా మీ ఇంట్లో జరిగిన కోపతాపాలూ, వాటి పర్యవసానాల్నూ వ్రాసి ఈ కూపన్ కత్తిరించి కవర్ మీద అంటించి మరీ పంపండి. 'కోపిష్టిపేజీ' లో ప్రచురిస్తాము.

చిరునామా: 'కోపిష్టిపేజీ'
ఎడిటర్, ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక
రోడ్డునెం. 8, బంజారాహిల్స్, హైదరాబాద్-34.